


5లో

కొత్త పూజాను చూస్తారంటున్న హెగ్డే

RNI NO :Title-Code :-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దినపత్రిక

అనుక్షణం ప్రజలపక్షం...

WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.

ఎడిటర్ : బిర్రు కరుణాకర్

Cell: 9701249103

ప్రచురణ : హైదరాబాద్, బుధవారం 21-2 -2024 సంపుటి :01 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ సంచిక : 149 పేజీలు : 4 వెల : 5-00



2లో

## పరువు నష్ట కేసులో రాహుల్‌కు ఊరట

అమిత్‌షా వ్యాఖ్యల కేసులో బెయిల్

సుల్తాన్‌పూర్ కోర్టుకు హాజరైన కాంగ్రెస్ నేత




2లో

## మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్

సర్వసన్నద్ధంగా కేంద్ర ఎన్నికల సంఘం



2లో

ఆందోళన కలిగిస్తున్న

## ఆత్మహత్యలు

-హాస్టళ్లలో సైకాలజిస్టులను నియమించాలి

- ఎమ్మెల్సీ కవిత వినతి

# ఆర్టికల్ 370 రద్దుతో రాష్ట్రంలో నవ్యపథం

కాశ్మీర్‌లో పలు అభివృద్ధి పనులకు మోడీ శ్రీకారం



దశాబ్దాలుగా వారసత్వ రాజకీయాల్లో మగ్గిన కాశ్మీర్

అడ్డుగోడ తొలగడంతో పురోగామి దిశగా పయనం

దేశాభివృద్ధి అంటే..కాశ్మీర్ అభివృద్ధి కూడా

వారతస్వ రాజకీయాలపై ఘాటు విమర్శలు

370 ఆర్టికల్ సినిమాపై ప్రస్తావన

మిగతా 2లో

జమ్మూ,ఫిబ్రవరి20 జర్నలిస్ట్ వార్త: దశాబ్దాల తరబడి వంశపారంపర్య రాజకీయాల భారాన్ని జమ్మూకశ్మీర్ భరించాల్సి వచ్చిందని ప్రధాని మోడీ అన్నారు. ఆ రాజకీయ నేతలు వారి కుటుంబాల గురించి మాత్రమే ఆలోచించేవారని, అయితే ..ఇప్పుడు అలాంటి పరిస్థితుల నుంచి విముక్తి లభిస్తున్నందుకు సంతోషంగా ఉందని వ్యాఖ్యలు చేశారు. కొన్నేళ్లుగా జమ్ము కశ్మీర్‌ను ఎవరూ పట్టించుకోలేదని.. ఇవాళ ఇక్కడి నుంచి అభివృద్ధి పనుల్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని దేశ ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మంగళవారం జమ్మూ నుంచి ఐఐటీ, ఐఐఎం, నవోదయ లాంటి విద్యాసంస్థలను ప్రారంభించి జాతికి అంకితం చేశారు.

జమ్ముకశ్మీర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం. త్వరలో వికసిత్ కశ్మీర్‌కల సాకారం అవుతుంది. మోదీ గ్యారెంటీ అంటే ఇలా ఉంటుంది అని అన్నారు. అభివృద్ధి చెందిన భారత్ అంటే అభివృద్ధి చెందిన జమ్మూకశ్మీర్ కూడా అని తెలిపారు. గత పదేళ్లలో ఈ ప్రాంతంలో కొత్తగా 50 డిగ్రీ కళాశాలలు ఏర్పాటయ్యాయని వెల్లడించారు. అప్పట్లో పాఠశాలలకు నిప్పంటించేవారని, ఇప్పుడు అలంకరిస్తున్నారని అన్నారు. బాలీవుడ్ నటి యామీ గౌతమ్ నటించిన ఆర్టికల్ 370 గురించి ప్రధాని మోదీ ప్రస్తావించారు.




## మేడారం జాతరకు పర్యాటక శాఖ ఏర్పాట్లు

- వీ.ఐ.పీ దర్శనంతో హెలికాప్టర్ సర్వీసులు ఏర్పాటు
- వివిఐపి, వీఐపీలకు , హరిత హోటల్ లో ఏర్పాట్లు
- ఆదివాసి ఛాయా చిత్ర ప్రదర్శన,
- పర్యాటక సమాచార కేంద్రం ఏర్పాటు



మేడారం,ఫిబ్రవరి20 జర్నలిస్ట్ వార్త: మేడారం మహా జాతరకు పర్యాటక శాఖ తరఫున సకల ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే కుంభమేళా వంటి మేడారం మహా జాతర లో పర్యాటక శాఖ తరఫున అనేక ఏర్పాట్లు చేయనైనది. మేడారం మహా జాతర సందర్భంగా హైదరాబాద్ నుంచి మేడారం వరకు విఐపి దర్శనం చేయించి, మళ్ళీ హైదరాబాద్ లో దించే హెలికాప్టర్ సర్వీసులను భక్తుల సౌకర్యార్థం పర్యాటకశాఖ ఏర్పాటు చేయడం జరిగింది. దేశంలో ఈ స్థాయిలో జరిగే మరే జాతరలో కూడా ఇలాంటి హెలికాప్టర్ సర్వీసులు లేవని, మేడారం జాతరలో మాత్రం ఐదవ సారి సైతం హెలికాప్టర్ సేవలను ఏర్పాటు చేశారు. మేడారం మహా జాతరకు వచ్చే వివిఐపీ, విఐపీల వసతి, భోజన ఏర్పాట్లను హరిత మేడారం వద్ద ఏర్పాటు చేశారు. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఉన్న హరిత రామప్ప , హరిత గట్టమ్మ , హరిత లక్నవరం హరిత తాడ్వాయి, హరిత భవత హోటల్ లో ఏర్పాట్లు చేయడం జరిగింది. హరిత హోటల్ మేడారం వద్ద గల ఆదివాసి మ్యూజియం ప్రాంగణంలో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఛాయాచిత్ర ప్రదర్శన, పర్యాటక సమాచార కేంద్రం ఏర్పాటు చేశారు.

## రాజ్యసభకు సోనియా గాంధీ ఏకగ్రీవ ఎన్నిక



జైపూర్ జర్నలిస్ట్ వార్త: కాంగ్రెస్ సీనియర్ నేత సోనియా గాంధీ రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే రాష్ట్రం నుంచి నామినేషన్ వేసిన బీజేపీ నేతలు చున్నీలాల్ గరాసియా, మదన్ రాథోడ్ కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు మంగళవారం సాయంత్రం ముగిసింది. రాష్ట్రంలో మూడు స్థానాలకు బరిలో ముగ్గురే మిగలడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది.లోక్‌సభ ఎంపీగా 6 పర్యాయాలు పనిచేసిన సోనియా గాంధీ.. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు చెందిన జైపూర్ నుంచి తొలిసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. కాగా సోనియా 2006 నుంచి రాయ్‌బరేలీ నుండి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2019 ఎన్నికల్లోనూ అమేథీలో రాహుల్ ఓడిపోయినప్పటికీ సోనియా రాయ్‌బరేలీ స్థానాన్ని గెలుచుకొని ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ గెలుచుకున్న ఏకైక స్థానంగా నిలిచింది.

## తెలంగాణ బద్ధవ్యతిరేకి రేవంత్ రెడ్డి

సిఎం కావడం జీర్ణించుకోలేకపోతున్నాం

షాద్‌నగర్ బిఆర్ఎస్ సమావేశంలో హరీష్ రావు




షాద్‌నగర్,ఫిబ్రవరి20 జర్నలిస్ట్ వార్త:

ఒక్కరోజు కూడా జై తెలంగాణ అనని వ్యక్తి, ఒక్కరోజు కూడా అమరుల స్థూపం వద్ద పువ్వు పెట్టని రేవంత్ రెడ్డి ఈరోజు తెలంగాణ సీఎం కావడం బాధాకరం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. గతంలో ఉద్యమకారుల మీదికి తుపాకీ పట్టుకొని పోయిన వ్యక్తిని ఈరోజు అసెంబ్లీలో సీఎం కుర్చీలో చూస్తే చాలా బాధగా ఉందన్నారు. షాద్ నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. కార్యకర్తలను ఇబ్బంది పెట్టినా,

కార్యకర్తల మీద అక్రమ కేసులు పెట్టినా ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు.. గంటలో షాద్‌నగర్‌లో ఉంటా అన్నారు. తన ఇల్లు కొంచెం ఇటుసైడే ఉంటదని, మిమ్మల్ని ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే మీ ఫోన్ కాల్ తో గంటసేపట్లో వచ్చేస్తానని భరోసా ఇచ్చారు.

## దమ్ముంటే

అమేథీనుంచే పోటీ చేయండి

రాహుల్‌కు స్మృతి ఇరానీ సవాల్



న్యూఢిల్లీ,ఫిబ్రవరి20జర్నలిస్ట్ వార్త:

దమ్ముంటే అమేథీలో పోటీ చేయాలని, వయనాడ్‌ను వదలాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి .. కేంద్రమంత్రి స్మృతి ఇరానీ సవాల్ విసిరారు. వయనాడ్ నియోజకవర్గాన్ని వదిలేసి.. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కేవలం అమేథీలోనే రాహుల్ పోటీ చేయాలని ఆమె అన్నారు. ఒకవేళ రాహుల్ నమ్మకంగా ఉంటే, వయనాడ్‌లో ఆయన పోటీ చేయాల్సిన అవసరం లేదని, కాంగ్రెస్ సీటుపై ఆయన అమేథీ నుంచి మాత్రమే పోటీ చేయాలని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ సవాల్ విసిరారు.

## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో తెలంగాణ సీఎం రేవంత్ భేటీ



న్యూఢిల్లీ :జర్నలిస్ట్ వార్త: దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి భేటీ అయ్యారు.తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారులు అభివృద్ధి, రాష్ట్రీయ రహదారులను జాతీయ రహదారు లుగా గుర్తింపు సహా పలు కీలక అంశాలపై చర్చించారు..

హైదరాబాద్ – శ్రీశైలం ఫోర్ లైన్ ఎలివేటెడ్ కారిడార్, హైదరాబాద్ – కల్వకుర్తి రహదారిని నాలుగు వరుసలుగా అభివృద్ధి చేయడం, రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ భాగం అభివృద్ధి, హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించడంపై గడ్కరీతో రేవంత్ రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి చర్చించారు. సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ నుండి తెలంగాణకు నిధుల కేటాయింపు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

# పరువు నష్ట కేసులో రాహుల్‌కు ఊరట

లక్నో,ఫిబ్రవరి20 కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఆరేళ్ల క్రితం నాటి ఈ కేసులో ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పుర్ జిల్లా కోర్టు తాజాగా బెయిల్ మంజూరు చేసింది.

భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా యూపీలోనే ఉన్న రాహుల్ కేసు విచారణ నిమిత్తం మంగళవారం కోర్టు ఎదుట హాజరయ్యారు. 2018 మే నెలలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వెళ్లిన రాహుల్.. కేంద్రమంత్రి అమిత్ షాపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. నాడు బెంగళూరులో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాజకీయాల్లో స్వచ్ఛంగా, నిజాయతీగా ఉంటామని చెప్పే భాజపా. ఓ హత్య కేసులో నిందితుడిని పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకుందని ఆరోపించారు. ఆ సమయంలో అమిత్ షా.. భాజపా జాతీయాధ్యక్షుడిగా ఉన్నారు. ఈ వ్యాఖ్యలు అప్పట్లో తీవ్ర దుమారం రేపాయి. ఈ క్రమంలోనే యూపీకి చెందిన భాజపా నేత విజయ్ మిశ్రా అదే ఏడాది ఆగస్టులో రాహుల్‌పై ప్రత్యేక ఎంపీ-ఎమ్మెల్యే కోర్టులో ఫిర్యాదు చేశారు. దీనిపై గతంలో పలుమార్లు న్యాయస్థానం ఆయనకు సమన్లు జారీ చేయగా రాహుల్ స్పందించలేదు. తాజాగా విచారణకు హాజరవ్వగా.. కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

కర్ణాటక ఎన్నికల సందర్భంగా బెంగళూరులో హోంమంత్రి అమిత్ షాపై రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో విజయ్ మిశ్రా అనే వ్యక్తి సుల్తాన్‌పూర్ కోర్టులో పరువు నష్టం దావా వేశారు.

ఈ కేసులో సుల్తాన్ పూర్ లోని జిల్లా సివిల్ కోర్టు రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేసింది. మంగళవారం ఈకేసు విచారణకు రాహుల్ గాంధీ కోర్టుకు హాజరయ్యారు. అనంతరం భారత్ జోడ్ న్యాయ్ యాత్రలో పాల్గొనేందుకు అమేథికి వెళ్లారు రాహుల్ గాంధీ. భారత్ జోడో న్యాయ్ యాత్ర మంగళవారంలో 38 వా రోజుకు చేరుకుంది. అమేథీ జిల్లాలో పురంత్ గంజ్ లతిరిగి ప్రారంభం అవుతుంది. ఈ యాత్ర రాయ్ మంగళవారం రాయ్ బరేలీ, లక్నో మీదుగా సాగనుంది. ఫిబ్రవరి 24 న కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఉత్తరప్రదేశ్ లోని మొరదాబాద్ నుంచి ఈ యాత్రలో చేరనున్నారు. 2024 ఏప్రిల్ మే లో లోక్ సభ ఎన్నికలు జరగాల్సి ఉండగా.. గెలుపు లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ భారత్ జోడో న్యాయ్ యాత్రను చేపట్టింది.

ఉత్తరప్రదేశ్ లోని అమేథీ ఒకప్పుడు కాంగ్రెస్ కు కంచుకోట. 2019 ఎన్నికల్లో రాహుల్ గాంధీ దాదాపు 55 వేల ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీ చేతిలో ఓడిపోయారు. కాంగ్రెస్ కంచుకోట అమేథీని తిరిగి వశం చేసుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. అంతేకాదు భారత్ జోడో న్యాయ్ యాత్ర ద్వారా పార్టీలో వచ్చే లోక్ సభ ఎన్నికల వరకు బలోపేతం చేసేందుకు కృషి చేస్తోంది.

## వారి నామినేషన్లు తిరస్కరణ.. ఆ ముగ్గురి ఎన్నిక లాంఛనమే..!



హైదరాబాద్ : రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు మంగళవారం సాయంత్రంతో ముగిసింది. తెలంగాణలో 3 స్థానాలకు బరిలో ముగ్గురే మిగలడంతో వారి ఎన్నిక ఏకగ్రీవమైంది.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా రేణుకా చౌదరి, అనిల్ కుమార్ యాదవ్, బీఆర్ఎస్ నుంచి వద్దిరాజు రవిచంద్ర నామినేషన్లు మాత్రమే మిగిలాయి.శ్రమజీవి పార్టీ తరపున జాజుల భాస్కర్, భోజరాజు కోయల్కర్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా కిరణ్ రాథోడ్‌లు నామినేషన్లు దాఖలు చేశారు.
అయితే రాజ్యసభ అభ్యర్థిగా పోటీ చేయాలనుకునే ఒక్కో అభ్యర్థికి మద్దతుగా కనీసం 10 మంది ఎమ్మెల్యేలు సంతకాలు చేయాల్సి ఉంటుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల నామినేషన్లపై 10 మంది ఎమ్మెల్యేలు సంతకాలు చేశారు.
కానీ మిగిలిన ముగ్గురికి మద్దతుగా ఎమ్మెల్యేలు ఎవరూ సంతకాలు చేయలేదు. దీంతో వారి నామినేషన్లను రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డి తిరస్కరించారు. కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి అనంతరం ఇద్దరు కాంగ్రెస్, ఒక బీఆర్ఎస్ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించనున్నారు.

## ప్రముఖ నటుడు రీతురాజ్ సింగ్ కన్నుమూత



ముంబయి, ప్రముఖ బాలీవుడ్ టీవీ యాక్టర్ రీతురాజ్ సింగ్ కన్నుమూశారు. కొంతకాలంగా ప్యాంక్రియాటిక్ వ్యాధితో బాధపడుతున్న ఆయన సోమవారం(ఫిబ్రవరి 19) రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు.59 ఏళ్ళ రీతురాజ్ సింగ్ మరణవార్తతో బాలీవుడ్ సినీ పరిశ్రమలో విషాద ఛాయలు అలుముకున్నాయి.ఇక రాజస్తాన్ కు చెందిన రీతూ రాజ్.. ఢిల్లీలో చదువుకుని అమెరికా వెళ్లిపోయారు.
అనంతరం ఇండియాకు తిరిగివచ్చిన రీతూ రాజ్ కుటుంబం ముంబయిలో సెటిల్ అయ్యారు. చిన్నప్పటి నుండి నటనపై ఆసక్తి ఉన్న రీతూ రాజ్.. టీవీ సీరియల్స్, ప్రోగ్రామ్స్ తోపాటు సినిమాల్లో కేసుల నటించాడు. జ్యోతీ, హిట్లర్ దీదీ, బనేగీ అప్నీ బాత్, షపత్, అదాలత్, సీఐడీ వంటి సీరియన్స్ లో సీరియల్స్‌లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

## కరీంనగర్‌లో భారీ అగ్నిప్రమాదం.. పేలిన గ్యాస్ సిలిండర్లు..!!



కరీంనగర్, కరీంనగర్ లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సుభాష్ నగర్ లోని ఓ ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్రమంగా పక్కన ఉన్న పూరిళ్లకు మంటలు వ్యాపించాయి.దీంతో ఐదు వంటగ్యాసు సిలిండర్లు పేలాయి. దీంతో పెద్దెత్తున మంటలు ఎగిసిపడుతున్నాయి. ఈ మంటలు
పరిసర ప్రాంతాలకు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇళ్లలో నివస్తిన్నవారు మేడారం జాతరకు వెళ్లడంతో పెద్దెత్తున ప్రాణ నష్టం తప్పింది. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## మరాఠాల రిజర్వేషన్‌కు ఓకే



ముంబై: మహారాష్ట్రలో విద్య, ఉద్యోగాల్లో మరాఠాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఆ రాష్ట్ర శాసనసభ సంబంధిత బిల్లుకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఇందుకోసం మంగళవారం ప్రత్యేకంగా సమావేశమైన రాష్ట్ర అసెంబ్లీలో మహారాష్ట్ర రాష్ట్ర విద్య, సామాజిక వెనుకబాటు బిల్లు-2024ను ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండే ప్రవేశపెట్టారు.

రాష్ట్రజనాభాలో మరాఠాలు 28 శాతం మంది ఉన్నారు. రాష్ట్రంలో మరాఠాలకు అమలయ్యే 10 శాతం రిజర్వేషన్‌ను పదేళ్ల తర్వాత సమీక్షిస్తారు. "రాష్ట్రంలో భిన్న కులాలు, వర్గాలకు ఇప్పటికే 52 శాతం రిజర్వేషన్‌లు అమలవుతున్నాయి.

ఇందులోనే ఓబీసీలకు19 శాతం రిజర్వేషన్ కలిసి ఉంది. అంటే దేశంలో పరిమిత 50 శాతం మార్కును దాటి రిజర్వేషన్లు అమలవుతున్నాయి" అని బిల్లులో పేర్కొన్నారు. "తమిళనాడులో 69 శాతం, హరియాణాలో 67 శాతం, రాజస్థాన్‌లో 64 శాతం, బిహార్‌లో 69 శాతం, గుజరాత్‌లో 59 శాతం, పశ్చిమబెంగాల్‌లో 55 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి.

ఓబీసీ కోటాలో కాకుండా రాష్ట్రంలో మరాఠాలకు విడిగా రిజర్వేషన్ ఇస్తున్నాం" అని సీఎం అన్నారు. వ్యవసాయ ఆధారిత కుంబీ కులానికి చెందిన మరాఠాలకు, వారి రక్తసంబంధీలకు మాత్రమే కుంబీ కుల ధ్రుజీవీకరణ పత్రమిస్తామని ప్రభుత్వం ముసాయిదా నోటిఫికేషన్‌లో పేర్కొంది.విడిగా కోటా వద్దు: జరాంగే మరాఠాలకు విడిగా కాకుండా ఓబీసీ రిజర్వేషన్లలోనే కోటా కావాలని ఉద్యమనేత మనోజ్ జరాంగే డిమాండ్ చేశారు.

## ఉనికి కోసమే బీజేపీతో చంద్రబాబు పొత్తు

అమరావతి: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఉనికిని కాపాడుకోవడం కోసమే చంద్రబాబు బీజేపీతో పొత్తు కోసం పాకులాడుతున్నారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి చెప్పారు. జనసేనతో జతకట్టినా చంద్రబాబుకు ఘోర ఓటమి భయం వెంటాడుతోందని, అందుకే బీజేపీతో పొత్తుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. సీఎం జగన్‌కు ప్రజల్లో వ్యతిరేకత ఉందని చంద్రబాబు భావిస్తే ఒంటరిగా పోటీ చేయడానికి ఎందుకు భయపడుతున్నారని నిలదీశారు.

ఆయన మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99.5 శాతం అమలు చేయడం ద్వారా ప్రజల్లో విశ్వసనీయతను సీఎం వైఎస్ జగన్ మరింత పెంచుకున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పొత్తులకు వ్యతిరేకమని, ఒంటరిగా పోటీ చేయడమే తమ విధానమని అన్నారు. ఎన్నికల్లో అమలు చేయగలిగిన హామీలే ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడం, నిత్యం జనంతో మమేకమవడం, ప్రజలకు మంచి చేయడం, మరింత మంచి చేయడానికి ఆశీర్వదించాలని ప్రజలను కోరడమే సీఎం జగన్ సిద్ధాంతమని తెలిపారు.

ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేసే చంద్రబాబును ప్రజలు నమ్మరని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 175 శాసనసభ స్థానాలు, 25 లోకసభ స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మళ్లీ వైఎస్ జగన్ సీఎం కావడం తథ్యమని, ప్రజలకు మరింత మేలు చేయడం ఖాయమని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ బిల్లులకు మద్దతు తెలిపామని ఆయన చెప్పారు. సెక్యులర్ భావనకు విఘాతం కలిగించే ట్రిపుల్ తలాఖ్ వంటి బిల్లులను వైఎస్సార్‌సీపీ వ్యతిరేకించిందని గుర్తు చేశారు.

# సేంద్రియ పంటలను ఎంచుకోవాలి

## పరిస్థితులకు బట్టి పంటల విధానం - రైతులకు శాస్త్రవేత్తల సూచన

నిజామాబాద్,ఫిబ్రవరి20 రైతులు అప్పుల నుంచి బయటపడేందుకు లాభసాటి, నాణ్యమైన పంటలు పండించాలని వ్యవసాయవేత్తలు సూచిస్తున్నాచారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలు పాటించి మంచి దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. రసాయన ఎరువులు వాడకంతో రైతులు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. రైతులు ఒకే సమయంలో ఒకే రకమైన పంటలు పండించడంతో నష్టపోతున్నారని అన్నారు. మారుతున్న పరిస్థితుల్లో డిమాండ్ ఉన్న పంటలను కేవలం సేంద్రియ పద్దతుల్లో పండించడం ద్వారా లాభాలు ఆర్జించాలన్నారు. అలాగే దీనిని అలవాటు చేసుకోవాలని అన్నారు. దుకాణాదారుల మోసపూరిత మాటలు నమ్మకూడదని, సారవంతమైన భూములను కాపాడుకోవాలని సూచించారు. అప్పుడే పంటలకు అంతర్జాతీయంగా కూడా డిమాండ్ ఉంటుందన్నారు. మార్కెట్‌లో డిమాండ్, అవసరాలకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని చెప్పారు. జొన్న, మొక్కజొన్న వంటి సంప్రదాయ పంటలను పండించాలని సూచించారు. రైతులు పత్తిని సీసీఐ వారికి అమ్మకుండా ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్మడంతో నష్టపోతున్నారని తెలిపారు. జీవ వైవిధ్యాన్ని పెంపొందించాలని, అంతరిస్తున్న అటవీ సంపదను కాపాడుకోవాలని అన్నారు.

267 రకాల పురుగులు పంటలను నాశనం చేస్తున్నాయని, జిల్లాలో వంద ఏండ్లకు పైగా పత్తి పంట సాగు చేస్తున్నారని, నిపుణులు, అనుభవజ్ఞులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనల ప్రకారం వ్యవసాయం చేయాలని సూచించారు. దిగుబడి పెరుగుతున్న కొద్దీ ధరలు కూడా పెరుగుతున్నాయని, వ్యవసాయ రంగంలో పురాతన పద్ధతులను పరిశీలిం చాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. వివిధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు వారి అనుభవాలను, సూచనలను అందించారు. పంట కాపాడుకొనే సమయంలో ఫెన్సింగ్‌కు విద్యుత్ అమర్చడంతో రైతులు మరణించడం, ఆ రైతు కుటుంబాలు అనాథలు అవుతున్నారని తెలిపారు.

# మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి20 సార్వత్రిక ఎన్నికలతేదీలపై కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు దాదాపు పూర్తయినట్లు తెలుస్తోంది. ఎన్నికలకు సిద్దంగా ఉన్నామని ఇప్పటికే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ప్రకటించారు. ఈ క్రమంలో త్వరలోనే నోటిఫికేషన్ వెలువడుతుందని ప్రచారం సాగుతోంది. గత లోక్‌సభ ఎన్నికలకు 2019 మార్చి 10న షెడ్యూల్‌ను ప్రకటించారు. ఏప్రిల్ 11 నుంచి మే 19వ తేదీ వరకు ఏడు దశల్లో పోలింగ్ జరిగింది. మే 23న ఓట్ల లెక్కంపు చేపట్టి ఫలితాలను ప్రకటించారు. ఈసారి కూడా ఏప్రిల్-మే నెలల్లోనే ఎన్నికలు నిర్వహించేలా ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. షెడ్యూల్ ప్రకటించగానే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. ఈ నేపథ్యంలో లోక్‌సభ, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఈసీ గత కొన్ని రోజులుగా రాష్ట్రాల్లో వరుస పర్యటనలు చేస్తున్న విషయం తెలిసిందే. రాజకీయ పార్టీలు, స్థానిక అధికారులతో సమావేశాలు నిర్వహించిన అధికారులు షెడ్యూల్‌ను సిద్ధం చేసినట్లు సమాచారం.
డిశా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీలకు ఈ ఏడాది మేలోగా ఎన్నికలు జరగాల్సి ఉంది. వీటితో పాటు జమ్మూకశ్మీర్‌లోనూ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించాలని ఈసీ భావిస్తోంది.

# ఆర్టికల్ 370 రద్దుతో రాష్ట్రంలో నవ్యపథం

(మొదటి పేజి తరువాయి)

మంగళవారం జమ్మూ పర్యటనకు వెళ్లిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రభుత్వ పథకాల లబ్దిదారులతో సంభాషించారు. అలాగే మౌలానా ఆజాద్ స్టేడియంలో నిర్వహించిన సభలోనూ ప్రసంగించారు. ఆర్టికల్ 370పై ఈ వారంలో ఒక సినిమా విడుదల కానుందని విన్నాను. అది మంచి విషయం. ప్రజలు వాస్తవాలు తెలుసుకునేందుకు ఆ చిత్రం ఉపకరించనుంది. జమ్మూకశ్మీర్ అభివృద్ధికి ఆర్టికల్ 370 ప్రధానమైన అవరోధంగా ఉండేది. దానిని భాజపా తొలగించడంతో ఇప్పుడు ఈ ప్రాంతం సమతుల్యత దిశగా కదులుతోంది. దాని రద్దు తర్వాతే ఇక్కడి ప్రజలు రాజ్యాంగంలో పేర్కొన్న సామాజిక న్యాయాన్ని పొందుతున్నారని మోదీ అన్నారు. అలాగే వారసత్వ రాజకీయాలపైనా విమర్శలు చేశారు. ఈ క్రమంలో జమ్మూ కశ్మీర్‌లో ఈరోజు 32 వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బహిరంగ సభలో ప్రసంగిస్తూ కుటుంబ రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. జమ్మూకశ్మీర్ అనేక దశాబ్దాలుగా రాజవంశ రాజకీయాల బాధితురాలిగా ఉందన్నారు. వంశపారంపర్య రాజకీయాలు చేస్తున్న వారు తమ ప్రయోజనాల కోసం మాత్రమే చూసుకున్నారు తప్ప మీ ప్రయోజనాలను పట్టించుకోలేదని పేర్కొన్నారు. వంశపారంపర్య రాజకీయాల వల్ల ఎక్కువగా నష్టపోయింది యువతేనని వెల్లడించారు. తమ కుటుంబం గురించి మాత్రమే ఆలోచించే వ్యక్తులు మీ కుటుంబం గురించి చింతించరని చెప్పారు. ఆర్టికల్ 370ని ప్రధాని మోదీ గోడతో పోల్చారు. ఆ గోడను బీజేపీ ప్రభుత్వం తొలగించిందని చెప్పారు.

ఇప్పుడు జమ్మూ కాశ్మీర్ సమతుల్య అభివృద్ధి దిశగా కొనసాగుతోందన్నారు. ఈరోజు వందలాది మంది యువతకు ప్రభుత్వ నియామక పత్రాలు అందజేశామని మోదీ గుర్తు చేశారు. ఈ క్రమంలోనే జమ్మూకశ్మీర్ ఈ వంశపారంపర్య రాజకీయాల నుంచి విముక్తి లభిస్తుందన్న సంతృప్తి ఉందన్నారు. జమ్మూకశ్మీర్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం భారీ కానుకలు అందించారు. సంగల్దాన్ స్టేషన్- బారాముల్లా స్టేషన్ మధ్య మొదటి ఎలక్ట్రిక్ రైలును ప్రధాని ప్రారంభించారు. బారాముల్లా- శ్రీనగర్-బనిహాల్-సంగల్దాన్ సెక్షన్ (185.66 కి.మీ) మధ్య కొత్త రైలు మార్గంతో సహా జమ్మూ, కాశ్మీర్‌లో వివిధ రైల్వే ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు.

## అన్నారం బ్యారేజీని పరిశీలించిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం



హైదరాబాద్:నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నేతృత్వంలోని నిపుణుల బృందం నేడు(మంగళవారం) రాష్ట్రానికి చేరుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం(సరస్వతీ) బ్యారేజీలను ఎన్‌డీఎస్‌ఏ అధికారులు పరిశీలించారు.ముందుగా అన్నారం బ్యారేజీలోని 39వ పియర్ వద్ద ఏర్పడిన సీపేజీ పరిశీలించారు. అనంతరం మేడిగడ్డ బ్యారేజ్ బ్లాక్ 7లో కుంగిన ప్రాంతాన్ని వీక్షించారు. నది గర్భంలో బ్యారేజీ కిందకు వెళ్లి ఇరువైపు ఏర్పడిన పగుళ్లను పరిశీలించారు.
కాగా బ్యారేజీలో వాటర్ లీకేజీ విషయాన్ని ఇంజనీర్లు నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ దృష్టికి తీసుకెళ్లగా.. మూడు బ్యారేజిల్లో నీళ్ల స్టోరేజి అంశాన్ని ఎన్‌డీఎస్‌ఏకు ప్రభుత్వం అప్పగించింది. ఎన్‌డీఎస్‌ఏ ఇచ్చే నివేదికతోనే మరమ్మత్తులు చేయాలా వద్దా అనే అంశంపై కాంగ్రెస్ సర్కార్ నిర్ణయం తీసుకోనుంది. మరమత్తుల కోసం అన్నారం బ్యారేజీలో ఇప్పటికే స్టోరేజ్ వాటర్ రిలీజ్ చేయాలని ఎన్‌డీఎస్‌ఏ సూచించిన క్రమంలో రాత్రికి రాత్రే గేట్లు తెరిచి నీటిని పూర్తిగా విడుదల చేశారు అధికారులు. బ్యారేజీలో నిలువ ఉన్న మొత్తం 2.5 టీఎంసీల నీటిని కిందికి వదిలారు. ఇక అన్నారం నీళ్లు వదలడంతో మేడిగడ్డ దగ్గర పనులు ఆగిపోయాయి.
కాగా ఈ బ్యారేజీలోపలుమార్లు సీపేజ్‌లు ఏర్పడగా.. ఆప్కాన్స్ సంస్థ ఇప్పటికే కెమికల్ గ్రౌటింగ్ చేసిన విషయం తెలిసిందే.
అయినప్పటికీ మరోచోట చిన్న చిన్న సీపేజ్‌లు కనిపిస్తున్నాయి. దీంతో సీపేజ్‌లకు పూర్తిస్థాయి ట్రీట్‌మెంట్ చేయడంతోపాటు బ్యారేజీలోని లోపాలను కనుగొనేందుకు ప్రభుత్వం పార్సన్ సంస్థకు ఇన్వెస్టిగేషన్ బాధ్యతలను అప్పగించింది.అయితే నీటిని పూర్తిగా ఖాళీ చేయడంతో బ్యారేజీ పొడవునా 1.6 కిలోమీటర్ల దూరం వరకు లక్ష క్యూబిక్ మీటర్ల మేర గేట్ల వద్ద అర మీటరు ఎత్తులో ఇసుక పేరుకుంది. దీంతో బ్యారేజీలో సమగ్ర సర్వే చేసేందుకు వీలవుతుందా అన్న సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక తీయకపోతే ఫౌండేషన్, పియర్, ర్యాఫ్ట్‌ల కింద ఖాళీ ప్రాంతం ఎక్కడ ఎంత మేర ఉందనేది తెలియదని ఇంజనీర్లు చెబుతున్నారు. ఇసుక తొలగించిన తరువాతనే సీపేజీ లీకేజీపై విశ్లేషణ సాధ్యం అవుతుందని అంటున్నారు. గేట్లు కూడా పాడైపోయినట్లు సమాచారం.

## ఆందోళన కలిగిస్తున్న ఆత్మహత్యలు

సూర్యాపేట,ఫిబ్రవరి20 రాష్ట్రంలో విద్యార్థినుల ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. ప్రభుత్వం వీటిని సీరియస్‌గా తీసుకొని తక్షణమే సమీక్ష నిర్వహించాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఇమాంపేట గురుకుల పాఠశాల విద్యార్థిని అస్మిత కుటుంబాన్ని మంగళవారం వారి స్వగ్రామమైన మోతె మండలం బురకచర్లలో పరమార్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటివరకు విద్యాశాఖ, సాంఘిక సంక్షేమ శాఖకు మంత్రే లేరని విమర్శించారు. హాస్టల్స్ నిర్వహణలో పర్యవేక్షణ లోపం కనిపిస్తుందన్నారు. ప్రతి హాస్టల్‌లో ఫ్రెండ్లీ నేచర్ కల్పించాలని కవిత సూచించారు. ప్రతి హాస్టల్‌లో సైకాలజిస్టులను ఏర్పాటు చేసి విద్యార్థుల్లో మనోధైర్యాన్ని కల్పిం చాలని పేర్కొన్నారు. ఎలాంటి ఒత్తిడి నైనా తట్టుకునేలా విద్యార్థులను తయారు చేయాలని చెప్పారు. అస్మిత కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రులు కూడా పరీక్షల సమయంలో విద్యార్థులపై ఒత్తిడి పెట్టవద్దని కోరారు. ఆత్మహత్యలపై ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ వెంటనే సమీక్ష నిర్వహించి ఆత్మహత్యల నివారణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. కవిత వెంట ఎంపీ లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నియమావళి ని పకడ్బందీగా అమలు చేయాలి

## అక్రమ నగదు, మద్యంపై పటిష్ట నిఘా...ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వే లైన్స్ టీమ్ లకు శిక్షణ

### : జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు




పుట్టపర్తి, (అక్షర విజయం)ఫిబ్రవరి 20: రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని, ప్రశాంత వాతావరణంలో జిల్లా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించే విధంగా గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్ లోని స్పందన సమావేశ మందిరంలో ఉదయం నుండి సాయంత్రం వరకు రెండు విడతలుగా ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఫ్లయింగ్ స్క్వాడ్, ఎన్నికల ఖర్చుల వ్యయ పర్యవేక్షణ కమిటీ , వీడియో సర్వేలెన్స్ టీం, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎం సి ఎం సి) అకౌంటింగ్ టీం, వీఎస్టీ, వివిటి పర్యవేక్షణ బృందం తదితర సభ్యులు చేపట్టవలసిన విధి , విధానాల గురించి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పుట్టపర్తి ,కదిరి , ధర్మవరం, అలాగే మధ్యాహ్నం నుంచి పెనుగొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గం లకు సంబంధించిన అయా టీం ల అధికారులు, పోలీస్ ఇతరత్రా శాఖల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత పవర్ పాయింట్ ప్రజెంటేషన్ శిక్షణ కార్యక్రమం ద్వారా భారత ఎన్నికల సంఘం నిబంధనలపై ఆయా బృందాలకు వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్ అవగాహన కల్పిస్తూ పలు సూచనలు,ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలను సజావుగా నిర్వహించడం కోసం ఎన్నికల విధులను కేటాయించిన వారందరూ తొలుత తాము నిర్వర్తించే విధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల్లో ప్రతి సూక్ష్మ అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించి వాటిని పూర్తిస్థాయిలో ఆకళింపు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఈ శిక్షణలో పాల్గొంటున్న బృందాలు ఎన్నికల సమయంలో నిత్యం జాగ్రత్తగా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల్లో ఇలాంటి శిక్షణ అనేది అత్యంత కీలకమన్నారు. ఎన్నికల విధుల్లో ఆయా నోడల్ అధికారులకు కూడా ముఖ్య పాత్ర ఉంటుందన్నారు.ఎన్నికల నిర్వహణలో భాగంగా విధులు నిర్వర్తించే అధికారులు ఉద్యోగులు, సమన్వయ సహకారాలు అందిపుచ్చుకోవాలని తద్వారా ఎలాంటి సమస్యలు ఉత్పన్నం అగుటకు అవకాశం ఉండదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా జిల్లాలో జరగనున్న ఆయా శాసనసభ మరియు పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల వివరాలను నామినేషన్ వేసిన రోజు నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల ఖర్చు పరిశీలన బృందాలు కచ్చితంగా వివరాలను నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల ఫలితాలు ప్రకటించిన 30 రోజుల్లో ఎన్నికల ఖర్చు వివరాలు అందించాల్సి ఉంటుందన్నారు. ఈ అంశాలల్లో ఎన్నికల్లో పోటీ చేస్తున్న వివిధ పార్టీల ప్రతినిధులకు, అభ్యర్థులకు కూడా అవగాహన ఎంతో అవసరం అన్నారు. అలాగే సరిహద్దు తనిఖీ కేంద్రాల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. అక్రమ రవాణా జరిగే మద్యం నగదు పై గట్టిగా ఉండాలని ఆస్తుల స్వాధీనంలో నిబంధన మేరకు జాగ్రత్తలు పాటించాలన్నారు. సహజంగా పోలీసు యంత్రాంగానికి రోజువారి విధులతో పాటు అదనంగా ఎన్నికల విధులు ఉంటాయని అందువల్ల వివిధ స్థాయిలో విధులు నిర్వర్తించే పోలీసు శాఖ ఉద్యోగ , సిబ్బంది ఓర్పు సహనాలతో విధులు నిర్వర్తించాలని సూచించారు. రాజకీయ పార్టీలు అభ్యర్థుల ద్వారా నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు రోడ్ షో అన్నింటిని వీడియో సర్వే లైన్స్ టీం సభ్యులు రికార్డింగ్ చేసి వీడియో పరిశీలన సభ్యుల ద్వారా సదరు వీడియోను పరిశీలించి వాటి వివరాలను అకౌంటింగ్ టీం సభ్యులకు అందించాలని ఆదేశించారు. అకౌంటింగ్ టీం సభ్యుల వివరాలను షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్ లో నమోదు చేయాలని తెలిపారు. అనంతరం పూర్తి వివరాలను సంబంధిత రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలని తెలిపారు. ర్యాలీలు, సమావేశాలు ద్వారా నిర్వహించిన పార్టీ ప్రచార ఖర్చులను నిర్ణయించిన ధరల ప్రకారం నమోదు చేయాలన్నారు. ఎన్నికల ప్రచారలో భాగంగా అభ్యర్థులు కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు ఇతర ప్రచార సామాగ్రిని ముద్రించినప్పుడు ఆ ప్రింటర్ మరియు ప్రచురణ కర్తలు ఎన్నికల ప్రజా ప్రాతినిధ్య చట్టం 19 51 ప్రకారం నిబంధనలు పాటించాల్సి ఉంటుందని ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులకు పోటీ చేస్తున్న అభ్యర్థులకు తెలుపాలని ఖర్చు వివరాల అంశంలో ఇన్ క మ్ టాక్స్, వాణిజ్య పనుల శాఖ వ్యయపరిశీలన శాఖలు ఎన్నికల వ్యయం నమోదులో సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. ఖర్చుల పరిశీలన బృందాలు రోజువారీగా వివరాలను నివేదిక రూపంలో అందజేయాలని సూచించారు. అదేవిధంగా జిల్లాకు నాలుగు వైపులా కర్ణాటక, ఇతర జిల్లాల సరిహద్దులు ఉన్నందున జిల్లా ఎస్పీ సహకారాలతో పోలీసు యంత్రాంగం గట్టి నిఘా పెంచాలని, ఎట్టి పరిస్థితుల్లో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు డబ్బు ,మద్యం, ఇతర కానుకలు లాంటివి పంపిణీ చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై కేసుల నమోదు అంశంలో తీసుకోవలసిన జాగ్రత్తలతో పాటు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం విధులు నిర్వర్తించడంలో ఎలాంటి అనుమానాలు ఉన్న వాటిని ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కు మునుపే నివృత్తిని చేసుకోవాలన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని కేటాయించిన ఎన్నికల విధులను సక్రమంగా బాధ్యతాయుతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటు చేయడం జరిగిందని అలాగే జిల్లా స్థాయిలో శిక్షణ కార్యక్రమంలో పూర్తి అయ్యాక ఆరో స్థాయిలో కూడా మరోసారి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన వెంటనే అధికారులు తమ విధులను చేపట్టాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు.అలాగే పోలీసు శాఖ ద్వారా సమస్యాత్మక అతి అతి సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచి ఎప్పటికప్పుడు గ్రామాలను సందర్శించి అక్కడి పరిస్థితులపై అధికారులకు సమాచారం అందించాలని, సరిహద్దు తనిఖీ కేంద్రాల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి అక్రమ రవాణాలను అరికట్టాలన్నారు. జిల్లాలో జరగనున్న ఎన్నికల్లో సమర్థవంతంగా తమ విధులను నిర్వర్తించి ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా విధుల పట్ల ప్రత్యేక దృష్టి సారించి అధికారులు అన్ని విధాల సంఘం కావాలని అలాగే ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేసి జిల్లాలో ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు ఆదేశించారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో డిఆర్ఓ కొండయ్య, పెనుగొండ పుట్టపర్తి ఆర్డిఓ భాగ్యరేఖ, కదిరి ఆర్డిఓ వంశీ కృష్ణ, ధర్మవరం ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, కదిరి డి ఎల్ డి వో మరియు మాస్టర్ ట్రైనర్ సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్లు పెనుగొండ వంశీ, మడకశిర రంగస్వామి, హిందూపురం శ్రీకాంత్ పుట్టపర్తి అంజయ్య ధర్మవరం రాజ్ కుమార్ , కదిరి కిరణ్ కుమార్ అనంతపురం, హిందూపురం ఇన్ కమ్ టాక్స్ అధికారులు విజయలక్ష్మి, ప్రమీత్, వివిధ టీములకు చెందిన అధికారులు, ఎన్నికల విభాగం డిప్యూటీ తాసిల్దార్లు మైనోద్దీన్ ,నరసింహులు తదితరులు పాల్గొన్నారు

## అగ్రంపహాడ్ జాతర ఏర్పాట్లు పరిశీలించిన హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్



హనుమకొండ, ఫిబ్రవరి 20(జర్నలిస్ట్ వార్త): ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ సమ్మ క్క సారలమ్మ జాతర ఏర్పాట్లను మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్
వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే జాతరలో భక్తుల సౌకర్యాలకు చేసిన స్నాన ఘట్టాలను, పబ్లిక్ టాయిలెట్స్ పనులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం వెహికల్ పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. జాతరలో పనులను పూర్తి చేసిన వివిధ శాఖలతో సమీక్షించారు. రెడ్ క్రాస్ హనుమకొండ వారు జాతరలో ఏర్పాటు చేసిన వైద్య శిభిరాన్ని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రారంభించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ నాలుగు రోజులపాటు వైభవంగా నిర్వహించే జాతర వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. భక్తుల సౌకర్యార్థం ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్త వహించాలని ఆదేశించారు. వివిధ శాఖల వారిగా అధికారులకు విధివిధానాలపై సలహాలు, సూచనలు చేశారు. వారి వెంట పరకాల ఆర్డీవో శ్రీనివాస్, ఏసీపీ కిషోర్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఆత్మకూరు సిఐ సంతోష్, ఈవో శేషగిరి, పంచాయతీరాజ్ డిఇ లింగారెడ్డి, ఎస్ఆర్ఎస్పి డిఈ వేణుగోపాల్, ఎలక్ట్రిసిటీ ఏఈ రవికుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, ఏపీవో రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి బుచ్చిరెడ్డి, తదితరులు ఉన్నారు.

## మేడారం జాతరకు వెళ్లే భక్తులకు పోలీస్ వారి విజ్ఞప్తి

భూపాలపల్లి, ఫిబ్రవరి 20(జర్నలిస్ట్ వార్త): భూపాలపల్లి పరిసర ప్రాంత ప్రజలు, మేడారం సమ్మక్క సారలమ్మ దర్శనానికి వెళ్ళే భక్తులు తమ వాహనాలను గాంధీనగర్, ఘనపూర్ మీదుగా మేడారం వెళ్లాలని మంగళవారం భూపాలపల్లి పోలీసులు కోరారు. కమలాపూర్, రాంపూర్ బయోక్కపేట మీదుగా వన్ వే ఉన్నందున ఈ దారి గుండా వాహనాలను మేడారం పంపబడవు అందువల్ల భక్తులు వన్ వే ట్రాఫిక్ పాటిస్తూ పోలీసు వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## మేడారం జాతరకు స్పెషల్ కౌంటర్ ఏర్పాటు

- ప్రారంభించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

- బస్టాండ్ లో భక్తులకు అన్నదానం: శ్రీనివాస్ రెడ్డి



వర్ధన్నపేట, ఫిబ్రవరి 20 (జర్న లిస్ట్ వార్త): మేడా రం జాతరను పురస్కరిం చుకుని వర్ధన్నపేట పట్టణ కేంద్ర ంలోని బస్టాండ్ లో మంగళవారం స్పెషల్ కౌంటర్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమ ప్రారంభానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మేడారం వెళ్ళే భక్తులకు బస్టాండ్ లో పరిపాటి శ్రీనివాస్ భోజన వసతి కల్పించారు. జాతరకు వెళ్ళే భక్తులు వివిధ గ్రామాలనుండి హడావిడిగా బయల్దేరిన బస్టాండ్ చేరుకుంటారు. ఆకలితో వెళ్లకుండా వారికి సొంత ఖర్చులతో కడుపునిండా భోజనం పెట్టి సాగనంపడం సంతోషంగా ఉందని ఎస్ఆర్ఆర్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వనదేవతల దర్శనానికి సుదూర ప్రాంతాలనుండి వర్ధన్నపేట మీదుగా ప్రయాణించే భక్తులు బస్టాండ్ లో శ్రీనివాస్ రెడ్డి ఏర్పాటు చేసిన భోజన సదుపాయాన్ని భక్తులంతా సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు శ్రీనివాస్ రెడ్డితో కలిసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, మండల ప్రజా ప్రతినిధులు సంధి అమ్మిరెడ్డి, రాజారెడ్డి, ఆర్టీసీ అధికారులు, డ్రైవర్లు, మేడారం వెళ్ళే భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవు

### - ఐనవోలు ఎస్సై అనిల్ కుమార్




ఐనవోలు, ఫిబ్రవరి 20(జర్న లిస్ట్ వార్త): ఐనవోలు మండలం వనమాల కనుపర్తి గ్రామ శివారులో మంగళవారం అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను ఎస్సై అనిల్ కుమార్ అడ్డుకు న్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం కునూరు గ్రామ శివారు ఆకేరు వాగు నుండి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న 2 ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని యాజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా తవ్వకాలు చేస్తూ ఇసుక రవాణా కొనసాగిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

## ఎస్టీ జాబితా నుంచి బంజారులను తొలగించాలి

### - నాయకులు కణితి వెంకటకృష్ణ



ములుగు, ఫిబ్రవరి 20(జర్నలిస్ట్ వార్త): వెంకటాపురం మండల కేంద్రంలో మంగళవారం గొండ్వానా సంక్షేమ పరిషత్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ములుగు జిల్లా బీఎస్పి ప్రధాన కార్యదర్శి కణితి వెంకట్ కృష్ణ మాట్లాడుతూ సంత్ సేవా లాల్ జయతి వేడుకల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బంజారులను ఎస్టీ జాబితాలో చేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకి చెందుతుందని చెప్పుకోవడం అన్యాయమన్నారు. ఆనాడు కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకింగ్ కోసం బంజారాలను ఎస్టీ జాబితాలో చేర్చి ఆదివాసులకు తీరని అన్యాయం చేశారని అన్నారు. పక్క రాష్ట్రంలో బంజారాలను ఓసీలుగా, బీసీలుగా గుర్తిస్తూ ఉంటే తెలంగాణ రాష్ట్రంలో బంజర్లను ఎస్టీలుగా గుర్తించడం చాలా దుర్మార్గపు చర్య అంటూ వారు మండిపడ్డారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో ఆదివాసులు కాంగ్రెస్ పార్టీకి సరైన గుణపాఠం చెబుతారని వారు హెచ్చరించారు. ఏజెన్సీ ప్రాంతంలో బంజరుల కుల ధ్రువీకరణ పత్రాలు నిలుపుదల చేసి ఈ ప్రభుత్వం వెంటనే ఎస్టీ జాబితాల నుండి బంజరులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మట్టి రమేష్, ఆనంద్, సమ్మయ్య, శంకర్ తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

రాయపర్తి, ఫిబ్రవరి 20(జర్నలిస్ట్ వార్త): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన రాయపర్తి మండలం ప్రధాన రహదారి వ్యవసాయ మార్కెట్ సమీపంలో చోటు చేసుకుంది. మంగళవారం ఎస్సై సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఆర్టీసీ బస్సు ఢీకొని ఆటో డ్రైవర్ మృతి చెందారని తెలిపారు. మృతుడు రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన గుడెల్లి శ్రీనివాస్ (45) ఆటో నడుపుకుంటూ జీవించే వారని తెలిపారు. దిన చర్యలో భాగంగా తన
ఆటో నడుపుతూ వర్ధన్నపేట నుండి తొర్రూరు వైపుకు వెళుతున్న క్రమంలో ఆటోను సూర్యాపేట నుండి వరంగల్ వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు వేరే ఆటోను ఓవర్టేక్ చేస్తున్న క్రమంలో బస్సు వెనుక భాగం ఆటోకు తగలడంతో ఒక్కసారిగా ఆటో పల్టీ కొట్టి, రెండు ముక్కలుగా విడిపోయింది. దీంతో ఆటోలో ఉన్న డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారని తెలిపారు. ఆటో పల్టీ కొడుతూ మేడారం కు వెళ్తున్న మరొక గూడ్స్ ఆటోను ఢీ కొట్టింది. గూడ్స్ వాహనం స్వల్పంగా దెబ్బతిందన్నారు. అనంతరం ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతి దేహాన్ని వర్ధన్నపేట మార్చురీకి తరలించారు.

# పరువు నష్ట కేసులో రాహుల్‌కు ఊరట

లక్నో,ఫిబ్రవరి20 కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఆరేళ్ల క్రితం నాటి ఈ కేసులో ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పుర్ జిల్లా కోర్టు తాజాగా బెయిల్ మంజూరు చేసింది.

భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా యూపీలోనే ఉన్న రాహుల్ కేసు విచారణ నిమిత్తం మంగళవారం కోర్టు ఎదుట హాజరయ్యారు. 2018 మే నెలలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వెళ్లిన రాహుల్.. కేంద్రమంత్రి అమిత్ షాపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. నాడు బెంగళూరులో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాజకీయాల్లో స్వచ్ఛంగా, నిజాయతీగా ఉంటామని చెప్పే భాజపా. ఓ హత్య కేసులో నిందితుడిని పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకుందని ఆరోపించారు. ఆ సమయంలో అమిత్ షా.. భాజపా జాతీయాధ్యక్షుడిగా ఉన్నారు. ఈ వ్యాఖ్యలు అప్పట్లో తీవ్ర దుమారం రేపాయి. ఈ క్రమంలోనే యూపీకి చెందిన భాజపా నేత విజయ్ మిశ్రా అదే ఏడాది ఆగస్టులో రాహుల్‌పై ప్రత్యేక ఎంపీ-ఎమ్మెల్యే కోర్టులో ఫిర్యాదు చేశారు. దీనిపై గతంలో పలుమార్లు న్యాయస్థానం ఆయనకు సమన్లు జారీ చేయగా రాహుల్ స్పందించలేదు. తాజాగా విచారణకు హాజరవ్వగా.. కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

కర్ణాటక ఎన్నికల సందర్భంగా బెంగళూరులో హోంమంత్రి అమిత్ షాపై రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో విజయ్ మిశ్రా అనే వ్యక్తి సుల్తాన్‌పూర్ కోర్టులో పరువు నష్టం దావా వేశారు.

ఈ కేసులో సుల్తాన్ పూర్ లోని జిల్లా సివిల్ కోర్టు రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేసింది. మంగళవారం ఈకేసు విచారణకు రాహుల్ గాంధీ కోర్టుకు హాజరయ్యారు. అనంతరం భారత్ జోడ్ న్యాయ్ యాత్రలో పాల్గొనేందుకు అమేథికి వెళ్లారు రాహుల్ గాంధీ. భారత్ జోడో న్యాయ్ యాత్ర మంగళవారంలో 38 వా రోజుకు చేరుకుంది. అమేథీ జిల్లాలో పురంత్ గంజ్ లతిరిగి ప్రారంభం అవుతుంది. ఈ యాత్ర రాయ్ మంగళవారం రాయ్ బరేలీ, లక్నో మీదుగా సాగనుంది. ఫిబ్రవరి 24 న కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఉత్తరప్రదేశ్ లోని మొరదాబాద్ నుంచి ఈ యాత్రలో చేరనున్నారు. 2024 ఏప్రిల్ మే లో లోక్ సభ ఎన్నికలు జరగాల్సి ఉండగా.. గెలుపు లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ భారత్ జోడో న్యాయ్ యాత్రను చేపట్టింది.

ఉత్తరప్రదేశ్ లోని అమేథీ ఒకప్పుడు కాంగ్రెస్ కు కంచుకోట. 2019 ఎన్నికల్లో రాహుల్ గాంధీ దాదాపు 55 వేల ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీ చేతిలో ఓడిపోయారు. కాంగ్రెస్ కంచుకోట అమేథీని తిరిగి వశం చేసుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. అంతేకాదు భారత్ జోడో న్యాయ్ యాత్ర ద్వారా పార్టీలో వచ్చే లోక్ సభ ఎన్నికల వరకు బలోపేతం చేసేందుకు కృషి చేస్తోంది.

## వారి నామినేషన్లు తిరస్కరణ..
## ఆ ముగ్గురి ఎన్నిక లాంఛనమే..!



హైదరాబాద్ : రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు మంగళవారం సాయంత్రంతో ముగిసింది. తెలంగాణలో 3 స్థానాలకు బరిలో ముగ్గురే మిగలడంతో వారి ఎన్నిక ఏకగ్రీవమైంది.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా రేణుకా చౌదరి, అనిల్ కుమార్ యాదవ్, బీఆర్ఎస్ నుంచి వద్దిరాజు రవిచంద్ర నామినేషన్లు మాత్రమే మిగిలాయి.శ్రమజీవి పార్టీ తరఫున జాజుల భాస్కర్, భోజరాజు కోయల్కర్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా కిరణ్ రాథోడ్‌లు నామినేషన్లు దాఖలు చేశారు.
అయితే రాజ్యసభ అభ్యర్థిగా పోటీ చేయాలనుకునే ఒక్కో అభ్యర్థికి మద్దతుగా కనీసం 10 మంది ఎమ్మెల్యేలు సంతకాలు చేయాల్సి ఉంటుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల నామినేషన్లపై 10 మంది ఎమ్మెల్యేలు సంతకాలు చేశారు.
కానీ మిగిలిన ముగ్గురికి మద్దతుగా ఎమ్మెల్యేలు ఎవరూ సంతకాలు చేయలేదు. దీంతో వారి నామినేషన్లను రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డి తిరస్కరించారు. కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి అనంతరం ఇద్దరు కాంగ్రెస్, ఒక బీఆర్ఎస్ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించనున్నారు.

## ప్రముఖ నటుడు రీతురాజ్ సింగ్ కన్నుమూత



ముంబయి, ప్రముఖ బాలీవుడ్ టీవీ యాక్టర్ రీతురాజ్ సింగ్ కన్నుమూశారు. కొంతకాలంగా ప్యాంక్రియాటిక్ వ్యాధితో బాధపడుతున్న ఆయన సోమవారం(ఫిబ్రవరి 19) రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. 59 ఏళ్ళ రీతురాజ్ సింగ్ మరణవార్తతో బాలీవుడ్ సినీ పరిశ్రమలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇక రాజస్తాన్ కు చెందిన రీతూ రాజ్.. ఢిల్లీలో చదువుకుని అమెరికా వెళ్లిపోయారు.
అనంతరం ఇండియాకు తిరిగివచ్చిన రీతూ రాజ్ కుటుంబం ముంబయిలో సెటిల్ అయ్యారు. చిన్నప్పటి నుండి నటనపై ఆసక్తి ఉన్న రీతూ రాజ్.. టీవీ సీరియల్స్, ప్రోగ్రామ్స్ తోపాటు సినిమాల్లో కేసుల నటించాడు. జ్యోతీ, హిట్లర్ దీదీ, బనేగీ అప్నీ బాత్, షపత్, అదాలత్, సీఐడీ వంటి సీరియన్స్ లో సీరియల్స్‌లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

## కరీంనగర్‌లో భారీ అగ్నిప్రమాదం..
### పేలిన గ్యాస్ సిలిండర్లు..!!



కరీంనగర్, కరీంనగర్ లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సుభాష్ నగర్ లోని ఓ ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్రమంగా పక్కన ఉన్న పూరిళ్లకు మంటలు వ్యాపించాయి. దీంతో ఐదు వంటగ్యాసు సిలిండర్లు పేలాయి. దీంతో పెద్దెత్తున మంటలు ఎగిసిపడుతున్నాయి. ఈ మంటలు
పరిసర ప్రాంతాలకు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇళ్లలో నివస్మిన్నవారు మేడారం జాతరకు వెళ్లడంతో పెద్దెత్తున ప్రాణ నష్టం తప్పింది. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## మరాఠాల రిజర్వేషన్‌కు ఓకే



ముంబై: మహారాష్ట్రలో విద్య, ఉద్యోగాల్లో మరాఠాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఆ రాష్ట్ర శాసనసభ సంబంధిత బిల్లుకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఇందుకోసం మంగళవారం ప్రత్యేకంగా సమావేశమైన రాష్ట్ర అసెంబ్లీలో మహారాష్ట్ర రాష్ట్ర విద్య, సామాజిక వెనుకబాటు బిల్లు-2024ను ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండే ప్రవేశపెట్టారు.

రాష్ట్రజనాభాలో మరాఠాలు 28 శాతం మంది ఉన్నారు. రాష్ట్రంలో మరాఠాలకు అమలయ్యే 10 శాతం రిజర్వేషన్‌ను పదేళ్ల తర్వాత సమీక్షిస్తారు. "రాష్ట్రంలో భిన్న కులాలు, వర్గాలకు ఇప్పటికే 52 శాతం రిజర్వేషన్‌లు అమలవుతున్నాయి.

ఇందులోనే ఓబీసీలకు19 శాతం రిజర్వేషన్ కలిసి ఉంది. అంటే దేశంలో పరిమిత 50 శాతం మార్కును దాటి రిజర్వేషన్లు అమలవుతున్నాయి" అని బిల్లులో పేర్కొన్నారు. "తమిళనాడులో 69 శాతం, హరియాణాలో 67 శాతం, రాజస్థాన్‌లో 64 శాతం, బిహార్‌లో 69 శాతం, గుజరాత్‌లో 59 శాతం, పశ్చిమబెంగాల్‌లో 55 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి.

ఓబీసీ కోటాలో కాకుండా రాష్ట్రంలో మరాఠాలకు విడిగా రిజర్వేషన్ ఇస్తున్నాం" అని సీఎం అన్నారు. వ్యవసాయ ఆధారిత కుంబీ కులానికి చెందిన మరాఠాలకు, వారి రక్తసంబంధీలకు మాత్రమే కుంబీ కుల ధ్రువీకరణ పత్రమిస్తామని ప్రభుత్వం ముసాయిదా నోటిఫికేషన్‌లో పేర్కొంది. విడిగా కోటా వద్దు: జరాంగే మరాఠాలకు విడిగా కాకుండా ఓబీసీ రిజర్వేషన్లలోనే కోటా కావాలని ఉద్యమనేత మనోజ్ జరాంగే డిమాండ్ చేశారు.

## ఉనికి కోసమే బీజేపీతో చంద్రబాబు పొత్తు

అమరావతి: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఉనికిని కాపాడుకోవడం కోసమే చంద్రబాబు బీజేపీతో పొత్తు కోసం పాకులాడుతున్నారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి చెప్పారు. జనసేనతో జతకట్టినా చంద్రబాబుకు ఘోర ఓటమి భయం వెంటాడుతోందని, అందుకే బీజేపీతో పొత్తుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. సీఎం జగన్‌కు ప్రజల్లో వ్యతిరేకత ఉందని చంద్రబాబు భావిస్తే ఒంటరిగా పోటీ చేయడానికి ఎందుకు భయపడుతున్నారని నిలదీశారు.

ఆయన మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99.5 శాతం అమలు చేయడం ద్వారా ప్రజల్లో విశ్వసనీయతను సీఎం వైఎస్ జగన్ మరింత పెంచుకున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పొత్తులకు వ్యతిరేకమని, ఒంటరిగా పోటీ చేయడమే తమ విధానమని అన్నారు. ఎన్నికల్లో అమలు చేయగలిగిన హామీలే ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడం, నిత్యం జనంతో మమేకమవడం, ప్రజలకు మంచి చేయడం, మరింత మంచి చేయడానికి ఆశీర్వదించాలని ప్రజలను కోరడమే సీఎం జగన్ సిద్ధాంతమని తెలిపారు.

ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేసే చంద్రబాబును ప్రజలు నమ్మరని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 175 శాసనసభ స్థానాలు, 25 లోక్‌సభ స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మళ్లీ వైఎస్ జగన్ సీఎం కావడం తథ్యమని, ప్రజలకు మరింత మేలు చేయడం ఖాయమని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ బిల్లులకు మద్దతు తెలిపామని ఆయన చెప్పారు. సెక్యులర్ భావనకు విఘాతం కలిగించే ట్రిపుల్ తలాఖ్ వంటి బిల్లులను వైఎస్సార్‌సీపీ వ్యతిరేకించిందని గుర్తు చేశారు.

## సేంద్రియ పంటలను ఎంచుకోవాలి

### పరిస్థితులకు బట్టి పంటల విధానం - రైతులకు శాస్త్రవేత్తల సూచన

నిజామాబాద్,ఫిబ్రవరి20 రైతులు అప్పుల నుంచి బయటపడేందుకు లాభసాటి, నాణ్యమైన పంటలు పండించాలని వ్యవసాయవేత్తలు సూచిస్తున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలు పాటించి మంచి దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. రసాయన ఎరువులు వాడకంతో రైతులు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. రైతులు ఒకే సమయంలో ఒకే రకమైన పంటలు పండించడంతో నష్టపోతున్నారని అన్నారు. మారుతున్న పరిస్థితుల్లో డిమాండ్ ఉన్న పంటలను కేవలం సేంద్రియ పద్ధతుల్లో పండించడం ద్వారా లాభాలు ఆర్జించాలన్నారు. అలాగే దీనిని అలవాటు చేసుకోవాలని అన్నారు. దుకాణాదారుల మోసపూరిత మాటలు నమ్మకూడదని, సారవంతమైన భూములను కాపాడుకోవాలని సూచించారు. అప్పుడే పంటలకు అంతర్జాతీయంగా కూడా డిమాండ్ ఉంటుందన్నారు. మార్కెట్‌లో డిమాండ్, అవసరాలకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని చెప్పారు. జొన్న, మొక్కజొన్న వంటి సంప్రదాయ పంటలను పండించాలని సూచించారు. రైతులు పత్తిని సీసీఐ వారికి అమ్మకుండా ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్మడంతో నష్టపోతున్నారని తెలిపారు. జీవ వైవిధ్యాన్ని పెంపొందించాలని, అంతరిస్తున్న అటవీ సంపదను కాపాడుకోవాలని అన్నారు.

267 రకాల పురుగులు పంటలను నాశనం చేస్తున్నాయని, జిల్లాలో వంద ఏండ్లకు పైగా పత్తి పంట సాగు చేస్తున్నారని, నిపుణులు, అనుభవజ్ఞులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనల ప్రకారం వ్యవసాయం చేయాలని సూచించారు. దిగుబడి పెరుగుతున్న కొద్దీ ధరలు కూడా పెరుగుతున్నాయని, వ్యవసాయ రంగంలో పురాతన పద్ధతులను పరిశీలిం చాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. వివిధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు వారి అనుభవాలను, సూచనలను అందించారు. పంట కాపాడుకొనే సమయంలో ఫెన్సింగ్‌కు విద్యుత్ అమర్చడంతో రైతులు మరణించడం, ఆ రైతు కుటుంబాలు అనాథలు అవుతున్నారని తెలిపారు.

## మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి20 సార్వత్రిక ఎన్నికలతేదీలపై కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు దాదాపు పూర్తయినట్లు తెలుస్తోంది. ఎన్నికలకు సిద్దంగా ఉన్నామని ఇప్పటికే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ప్రకటించారు. ఈ క్రమంలో త్వరలోనే నోటిఫికేషన్ వెలువడుతుందని ప్రచారం సాగుతోంది. గత లోక్‌సభ ఎన్నికలకు 2019 మార్చి 10న షెడ్యూల్‌ను ప్రకటించారు. ఏప్రిల్ 11 నుంచి మే 19వ తేదీ వరకు ఏడు దశల్లో పోలింగ్ జరిగింది. మే 23న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించారు. ఈసారి కూడా ఏప్రిల్-మే నెలల్లోనే ఎన్నికలు నిర్వహించేలా ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. షెడ్యూల్ ప్రకటించగానే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. ఈ నేపథ్యంలో లోక్‌సభ, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఈసీ గత కొన్ని రోజులుగా రాష్ట్రాల్లో వరుస పర్యటనలు చేస్తున్న విషయం తెలిసిందే. రాజకీయ పార్టీలు, స్థానిక అధికారులతో సమావేశాలు నిర్వహించిన అధికారులు షెడ్యూల్‌ను సిద్ధం చేసినట్లు సమాచారం.
డిశా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీలకు ఈ ఏడాది మేలోగా ఎన్నికలు జరగాల్సి ఉంది. వీటితో పాటు జమ్మూకశ్మీర్‌లోనూ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించాలని ఈసీ భావిస్తోంది.

## ఆర్టికల్ 370 రద్దుతో రాష్ట్రంలో నవ్యపథం

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం జమ్మూ పర్యటనకు వెళ్లిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రభుత్వ పథకాల లబ్దిదారులతో సంభాషించారు. అలాగే మౌలానా ఆజాద్ స్టేడియంలో నిర్వహించిన సభలోనూ ప్రసంగించారు. ఆర్టికల్ 370పై ఈ వారంలో ఒక సినిమా విడుదల కానుందని విన్నాను. అది మంచి విషయం. ప్రజలు వాస్తవాలు తెలుసుకునేందుకు ఆ చిత్రం ఉపకరించనుంది. జమ్మూకశ్మీర్ అభివృద్ధికి ఆర్టికల్ 370 ప్రధానమైన అవరోధంగా ఉండేది. దానిని భాజపా తొలగించడంతో ఇప్పుడు ఈ ప్రాంతం సమతుల్యత దిశగా కదులుతోంది. దాని రద్దు తర్వాతే ఇక్కడి ప్రజలు రాజ్యాంగంలో పేర్కొన్న సామాజిక న్యాయాన్ని పొందుతున్నారని మోదీ అన్నారు. అలాగే వారసత్వ రాజకీయాలపైనా విమర్శలు చేశారు. ఈ క్రమంలో జమ్మూ కశ్మీర్‌లో ఈరోజు 32 వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బహిరంగ సభలో ప్రసంగిస్తూ కుటుంబ రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. జమ్మూకశ్మీర్ అనేక దశాబ్దాలుగా రాజవంశ రాజకీయాల బాధితురాలిగా ఉందన్నారు. వంశపారంపర్య రాజకీయాలు చేస్తున్న వారు తమ ప్రయోజనాల కోసం మాత్రమే చూసుకున్నారు తప్ప మీ ప్రయోజనాలను పట్టించుకోలేదని పేర్కొన్నారు. వంశపారంపర్య రాజకీయాల వల్ల ఎక్కువగా నష్టపోయింది యువతేనని వెల్లడించారు. తమ కుటుంబం గురించి మాత్రమే ఆలోచించే వ్యక్తులు మీ కుటుంబం గురించి చింతించరని చెప్పారు. ఆర్టికల్ 370ని ప్రధాని మోదీ గోడతో పోల్చారు. ఆ గోడను బీజేపీ ప్రభుత్వం తొలగించిందని చెప్పారు.

ఇప్పుడు జమ్మూ కాశ్మీర్ సమతుల్య అభివృద్ధి దిశగా కొనసాగుతోందన్నారు. ఈరోజు వందలాది మంది యువతకు ప్రభుత్వ నియామక పత్రాలు అందజేశామని మోదీ గుర్తు చేశారు. ఈ క్రమంలోనే జమ్మూకశ్మీర్ ఈ వంశపారంపర్య రాజకీయాల నుంచి విముక్తి లభిస్తుందన్న సంతృప్తి ఉందన్నారు. జమ్మూకశ్మీర్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం భారీ కానుకలు అందించారు. సంగల్దాన్ స్టేషన్- బారాముల్లా స్టేషన్ మధ్య మొదటి ఎలక్ట్రిక్ రైలును ప్రధాని ప్రారంభించారు. బారాముల్లా- శ్రీనగర్-బనిహాల్-సంగల్దాన్ సెక్షన్ (185.66 కి.మీ) మధ్య కొత్త రైలు మార్గంతో సహా జమ్మూ, కాశ్మీర్‌లో వివిధ రైల్వే ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు.

## అన్నారం బ్యారేజీని పరిశీలించిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం



హైదరాబాద్:నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నేతృత్వంలోని నిపుణుల బృందం నేడు(మంగళవారం) రాష్ట్రానికి చేరుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం(సరస్వతీ) బ్యారేజీలను ఎన్‌డీఎస్‌ఏ అధికారులు పరిశీలించారు. ముందుగా అన్నారం బ్యారేజీలోని 39వ పియర్ వద్ద ఏర్పడిన సీపేజీ పరిశీలించారు. అనంతరం మేడిగడ్డ బ్యారేజ్ బ్లాక్ 7లో కుంగిన ప్రాంతాన్ని వీక్షించారు. నది గర్భంలో బ్యారేజీ కిందకు వెళ్లి ఇరువైపు ఏర్పడిన పగుళ్లను పరిశీలించారు.
కాగా బ్యారేజీలో వాటర్ లీకేజీ విషయాన్ని ఇంజనీర్లు నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ దృష్టికి తీసుకెళ్లగా.. మూడు బ్యారేజిల్లో నీళ్ల స్టోరేజి అంశాన్ని ఎన్‌డీఎస్‌ఏకు ప్రభుత్వం అప్పగించింది. ఎన్‌డీఎస్‌ఏ ఇచ్చే నివేదికతోనే మరమ్మత్తులు చేయాలా వద్దా అనే అంశంపై కాంగ్రెస్ సర్కార్ నిర్ణయం తీసుకోనుంది. మరమత్తుల కోసం అన్నారం బ్యారేజీలో ఇప్పటికే స్టోరేజ్ వాటర్ రిలీజ్ చేయాలని ఎన్‌డీఎస్‌ఏ సూచించిన క్రమంలో రాత్రికి రాత్రే గేట్లు తెరిచి నీటిని పూర్తిగా విడుదల చేశారు అధికారులు. బ్యారేజీలో నిలువ ఉన్న మొత్తం 2.5 టీఎంసీల నీటిని కిందికి వదిలారు. ఇక అన్నారం నీళ్లు వదలడంతో మేడిగడ్డ దగ్గర పనులు ఆగిపోయాయి.
కాగా ఈ బ్యారేజీలోపలుమార్లు సీపేజ్‌లు ఏర్పడగా.. ఆప్కాన్స్ సంస్థ ఇప్పటికే కెమికల్ గ్రౌటింగ్ చేసిన విషయం తెలిసిందే.
అయినప్పటికీ మరోచోట చిన్న చిన్న సీపేజ్‌లు కనిపిస్తున్నాయి. దీంతో సీపేజ్‌లకు పూర్తిస్థాయి ట్రీట్‌మెంట్ చేయడంతోపాటు బ్యారేజీలోని లోపాలను కనుగొనేందుకు ప్రభుత్వం పార్సన్ సంస్థకు ఇన్వెస్టిగేషన్ బాధ్యతలను అప్పగించింది. అయితే నీటిని పూర్తిగా ఖాళీ చేయడంతో బ్యారేజీ పొడవునా 1.6 కిలోమీటర్ల దూరం వరకు లక్ష క్యూబిక్ మీటర్ల మేర గేట్ల వద్ద అర మీటరు ఎత్తులో ఇసుక పేరుకుంది. దీంతో బ్యారేజీలో సమగ్ర సర్వే చేసేందుకు వీలవుతుందా అన్న సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక తీయకపోతే ఫౌండేషన్, పియర్, ర్యాఫ్ట్‌ల కింద ఖాళీ ప్రాంతం ఎక్కడ ఎంత మేర ఉందనేది తెలియదని ఇంజనీర్లు చెబుతున్నారు. ఇసుక తొలగించిన తరువాతనే సీపేజీ లీకేజీపై విశ్లేషణ సాధ్యం అవుతుందని అంటున్నారు. గేట్లు కూడా పాడైపోయినట్లు సమాచారం.

## ఆందోళన కలిగిస్తున్న ఆత్మహత్యలు

సూర్యాపేట,ఫిబ్రవరి20 రాష్ట్రంలో విద్యార్థినుల ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. ప్రభుత్వం వీటిని సీరియస్‌గా తీసుకొని తక్షణమే సమీక్ష నిర్వహించాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఇమాంపేట గురుకుల పాఠశాల విద్యార్థిని అస్మిత కుటుంబాన్ని మంగళవారం వారి స్వగ్రామమైన మోతె మండలం బురకచర్లలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటివరకు విద్యాశాఖ, సాంఘిక సంక్షేమ శాఖకు మంత్రే లేరని విమర్శించారు. హాస్టల్స్ నిర్వహణలో పర్యవేక్షణ లోపం కనిపిస్తుందన్నారు. ప్రతి హాస్టల్‌లో ఫ్రెండ్లీ నేచర్ కల్పించాలని కవిత సూచించారు. ప్రతి హాస్టల్‌లో సైకాలజిస్టులను ఏర్పాటు చేసి విద్యార్థుల్లో మనోధైర్యాన్ని కల్పిం చాలని పేర్కొన్నారు. ఎలాంటి ఒత్తిడి నైనా తట్టుకునేలా విద్యార్థులను తయారు చేయాలని చెప్పారు. అస్మిత కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రులు కూడా పరీక్షల సమయంలో విద్యార్థులపై ఒత్తిడి పెట్టవద్దని కోరారు. ఆత్మహత్యలపై ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ వెంటనే సమీక్ష నిర్వహించి ఆత్మహత్యల నివారణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. కవిత వెంట ఎంపీ లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# నేడు గోవాలో నటి రకుల్ పెళ్లి



హాజరు కానున్న పలువురు ప్రముఖులు

గత రెండేళ్లలో బాలీవుడ్‌లో ఎన్నో సెలబ్రిటీల పెళ్లిళ్లు జరిగాయి. ఇక ఇప్పుడు రకుల్ ప్రీత్ సింగ్ కూడా ఆ జాబితాలో చేరనుంది. హీరో, ప్రొడ్యూసర్ అయిన జాకీ భగ్నానీని రకుల్ ప్రేమించి పెళ్లి చేసుకోనుంది. ఫిబ్రవరి 21న గోవాలో రకుల్, జాకీ డెస్టినేషన్ వెడ్డింగ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఇక దానికోసం రెండు రోజుల ముందే అక్కడికి చేరుకున్నారు. రకుల్, జాకీ.. ఇద్దరికీ బాలీవుడ్‌లో మంచి గుర్తింపు ఉంది. అందుకే హిందీ సినీ పరిశ్రమలో వీరిద్దరికీ క్లోజ్ అయిన నటీనటులు ఈ వివాహానికి హాజరు కానున్నారు. అంతే కాకుండా ఒక సీనియర్ నటి ఈ పెళ్లిలో డ్యాన్స్ చేయడంతో పాటు తనకు కాబోయే భార్య రకుల్‌కు ఒక స్పెషల్ సర్‌ప్రైజ్‌ను కూడా ప్లాన్ చేశాడట జాకీ. రకుల్ ప్రీత్ సింగ్, జాకీ భగ్నానీ మూడేళ్ల క్రితం తమ ప్రేమ గురించి సోషల్ మీడియాలో ప్రకటించారు. అప్పటినుండి వీరి పెళ్లి ఎప్పుడా అని ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. చివరగా గోవాలో వీరి డెస్టినేషన్ వెడ్డింగ్ జరగనుంది అని రూమర్ మొదలయ్యింది. అది రూమర్ కాదు.. నిజమే అని కన్ఫర్మ్ అయ్యింది. ఇక ఈ పెళ్లిలో తనకు కాబోయే భార్య రకుల్‌కు స్పెషల్ సర్‌ప్రైజ్‌ను ఎ÷-లాన్ చేశాడట జాకీ భగ్నానీ. అక్కడ తన కోసం పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నాడని సమాచారం. వారి లవ్ స్టోరీపై ఒక ప్రత్యేకంగా పాటను రాయించాడట జాకీ. మయూర్ పూరీ అనే రైటర్‌తో రకుల్, తన ప్రేమకథను 'బిన్ తేరే' అనే పాటను తయారు చేయించాడట. ఈ పాటపై పెళ్లిలో జాకీ స్పెషల్ పెర్ఫార్మెన్స్ ఉంటుందని సమాచారం. బిన్ తేరే' పాటకు తనిష్క్ బాగ్చీ సంగీతాన్ని అందించగా.. జాహ్రాహ్ ఎస్ ఖాన్, రోమీలతో పాటు జాకీ స్వయంగా దీనిని పాడాడు. 'రకుల్ కోసం రాయించిన ఈ పాట కోసం జాకీ తన ప్రాణం పెట్టాడు. ఇది పెళ్లిలో ముఖ్యమైన ఘట్టం కానుంది. తనకు గుర్తుండిపోయే గిఫ్ట్ ఇవ్వాలనే ఆలోచనతో ఈ ఐడియాతో ముందుకొచ్చాడు. ఈ పాట వారి ప్రేమకథను సెలబ్రేట్ చేసే విధంగా ఉంటుంది' అని జాకీ సన్నిహితులు రివీల్ చేశారు. దీంతో పాటు పెళ్లికి వచ్చిన గెస్టులకు కూడా స్పెషల్ పర్ఫార్మెన్స్‌లు ఉండనున్నాయి. సీనియర్ నటి శిల్పా శెట్టి.. తన భర్త రాజ్ కుంద్రాతో కలిసి రకుల్, జాకీల పెళ్లిలో పెర్ఫార్మ్ చేయనున్నట్టు సమాచారం. లక్ష్మి మంచు, ప్రగ్యా జైస్వాల్, అజయ్ దేవగన్.. ఇలా ఎందరో సెలబ్రిటీలు రకుల్, జాకీల పెళ్లిలో సందడి చేయనున్నారు. పెళ్లి పనుల కోసం గోవాకు బయల్దేరే ముందు ముంబాయ్‌లోని సిద్ధి వినాయకుడి ఆలయాన్ని సందర్శించుకుంది ఈ జంట. దానికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి



# ఫర్హాన్ అక్తర్ డాన్ 3 లో కియారా

రామ్ చరణ్ తో 'గేమ్ చెంజర్' సినిమా చేస్తున్న బాలీవుడ్ నటి కియారా అద్వానీ ఇప్పుడు మరో పెద్ద ఛాన్స్ కొట్టేసింది. దర్శకుడు ఫర్హాన్ అక్తర్ తీయబోయే 'డాన్ 3' సినిమాలో కియారా అద్వానీ చేస్తున్నట్టుగా అధికారికంగా ప్రకటన వచ్చింది. ఇందులో రణవీర్ సింగ్ కథానాయకుడిగా నటిస్తుండగా, అతనికి జోడీగా కియారా అద్వానీ చేస్తున్నట్టుగా చిత్ర నిర్వాహకులు ప్రకటించారు. ఇది ఇంతకు ముందు తీసిన 'డాన్' సినిమాకి రెండో సీక్వెల్ గా రావటం విశేషం. దర్శకుడు ఫర్హాన్ అక్తర్ సామాజిక మాధ్యమం ద్వారా ఈ విషయాన్ని చెపుతూ, మా డాన్ యూనివర్స్‌కి స్వాగతం అంటూ కియారా అద్వానీ కి చెప్పారు. కియారా మొదటిసారిగా రణవీర్‌సింగ్‌తో ఈ సినిమాలో నటిస్తున్నారు, ఇంతకు ముందు ఆమె రణవీర్ సింగ్ తో చెయ్యలేదు. ఇంతకు ముందు వచ్చిన రెండు సినిమాలలో షా రుఖ్ ఖాన్, ప్రియాంక చోప్రా నటించారు, ఇప్పుడు రణవీర్ సింగ్ ఈ మూడో సినిమాలో కథానాయకుడిగా నటిస్తున్నారు.ఇది ఒక యాక్షన్ సినిమాగా తెరకెక్కనుందని అంటున్నారు, ఇందులో కియారా అద్వానీ ఒక యాక్షన్ పాత్రలో కనిపించ నున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉండగా, కియారా ఇంకో యాక్షన్ సినిమాలో కూడా నటిస్తున్నారు. హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ కలిపి నటిస్తున్న 'వార్ 2'లో కూడా కియారా అద్వానీ కథానాయికగా నటిస్తోంది. ఇంతవరకు యాక్షన్ పాత్రలు చెయ్యని కియారా ఇప్పుడు ఈ 'డాన్ 3', 'వార్ 2' లతో, యాక్షన్ జానర్‌లో కూడా తన ప్రతిభ చూపించుకోవడానికే అవకాశం దక్కింది. అలాగే తెలుగులో 'గేమ్ చెంజర్' లో రామ్ చరణ్ పక్కన నటిస్తోంది.




# కొత్త పూజాను చూస్తారంటున్న హెగ్డే

గత ఏడాది ఏప్రిల్‌లో విడుదలైన సల్మాన్ 'కిసీ కా భాయ్ కిసీకి జాన్' తర్వాత పూజా హెగ్డే సినిమా ఒక్కటి కూడా విడుదల కాలేదు. దాదాపు ఏడాది నుంచి తమ అభిమాన తార వెండితెరపై కనిపించకపోవడం పూజా అభిమానులను ఆవేదనకు గురి చేస్తున్న అంశం. అయితే.. ఈ బాధ ఈ ఏడాది అక్టోబర్ 11 వరకేనని, ఆరోజు షాహిద్‌కపూర్‌తో తాను నటిస్తున్న 'దేవ' విడుదల కానున్నదని, అందులో కొత్త పూజాని చూస్తారని మంగళూరు భామ పూజా హెగ్డే అంటున్నారు. తన కెరీర్‌లో ఇప్పటివరకూ చేయని భిన్నమైన పాత్రను 'దేవ'లో చేస్తున్నట్టు పూజ చెప్పారు.

ఓ హై ప్రొ÷ల్ కేస్ ఇన్వెస్టిగేషన్ నేపథ్యంలో ఈ సినిమా కథ నడుస్తుందని, కథనం షాక్‌కు గురిచేస్తుందని, తన పాత్ర తీరుతెన్నులు ఆడియన్స్‌ని షాక్‌కి లోనుచేస్తాయని పూజా తెలిపారు.

# రామ్ చరణ్ - అల్లు అర్జున్ లకు తండ్రులుగా సల్మాన్ ఖాన్, షారుఖ్ ఖాన్!



న్యూస్ లైన్, హైదరాబాద్ : బాలీవుడ్ లో టాప్ 2 హీరోలు ఎవరు అంటే మన అందరికీ గుర్తుకు వచ్చేది షారుఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్. వీళ్లిద్దరి సినిమాలు విడుదల కాకపోతే థియేటర్స్ వెలవెలబోయ్యే పరిస్థితి ఉంటుంది.ఎన్నోసార్లు అలాంటి సందర్భాలు వచ్చాయి కూడా. వీళ్లిద్దరు కలిసి గతం లో ఎన్నో సినిమాల్లో నటించారు. కానీ అభిమానులు, బాలీవుడ్ ప్రేక్షకులు ఎప్పటికీ మర్చిపోలేని సినిమా 'కరణ్ – అర్జున్'. హృతిక్ రోషన్ తండ్రి రాకేష్ రోషన్ దర్శకత్వం లో తెరకెక్కిన ఈ సినిమా 1995 వ సంవత్సరం లో విడుదలై పెద్ద బ్లాక్ బస్టర్ హిట్ గా నిల్చింది. ఈ సినిమాకి సీక్వెల్ తియ్యాలని చాలా మంది ప్రయత్నం చేసారు కానీ, ఎందుకో వర్కౌట్ అవ్వలేదు. అయితే మన టాలీవుడ్ టాప్ నిర్మాత అల్లు అరవింద్ మాత్రం ఈ సినిమాకి సీక్వెల్ తియ్యడానికి రంగం సిద్ధం చేస్తున్నాడు. చాలా ఏళ్ళ క్రితమే ఆయన 'చరణ్ – అర్జున్' పేరుతో ఫిలిం ఛాంబర్ లో టైటిల్ ని రిజిస్టర్ చేయించాడు.

ఎప్పటికైనా రామ్ చరణ్, అల్లు అర్జున్ తో కలిసి ఒక మల్టీస్టారర్ తీస్తానని, అందుకోసమే ముందుగా ఈ టైటిల్ ని రిజిస్టర్ చేయించాను అంటూ పలు ఇంటర్వ్యూస్ లో చెప్పుకొచ్చాడు. ఇప్పుడు పాన్ ఇండియా లెవెల్ లో మల్టీస్టారర్ ట్రెండ్ నడుస్తుంది కాబట్టి రామ్ చరణ్, అల్లు అర్జున్ తో 'కరణ్ – అర్జున్' సీక్వెల్ తియ్యడానికి సిద్ధం అయ్యాడు అల్లు అరవింద్. ఇందులో వీళ్లిద్దరు షారుఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్ లకు కొడుకులుగా నటిస్తారట. ఇప్పటికే ఇందుకోసం షారుఖ్, సల్మాన్ ని అల్లు అరవింద్ సంప్రదించగా, వాళ్ళు ఒకే చెప్పినట్టు తెలుస్తుంది. 2026 వ సంవత్సరం దివాళీకి ఈ చిత్రాన్ని విడుదల చేసే ప్లాన్ లో ఉన్నారట. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియనుంది.